క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: రోడ్డు విస్తరణలో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ గుంటూరు-2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్వీఎస్ కాలనీ, జేకేసీ కాలేజ్ రోడ్డు, తారకరామ్‌నగర్, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- 11 కేవీ కోబాల్ట్ పేట ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మెయింటనెన్స్‌లో భాగంగా కోబాల్ట్‌పేట, పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఇన్‌చార్జిగా దినేష్

నెహ్రూనగర్: అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఇన్‌చార్జిగా జ్యోతి దినేష్‌ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల వీరాస్వామి తెలియజేశారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో, మండలాల్లో అంబేడ్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు తగిన కృషి చేయాలని వీరాస్వామి తెలియజేశారు. నూతనంగా జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన దినేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తానని చెప్పారు.

పాత పెన్షన్ వర్తింప చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: 2003లో డీఎస్సీ ద్వారా నియామకం పొందిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గుంటూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు తలపెట్టిన శాంతియుత ధర్నాకు రాష్ట్రోపాధ్యాయ సంఘ (ఎస్టీయూ) గుంటూరు జిల్లా శాఖ తరపున మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, డీకే సుబ్బారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గత 20 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కారం కోసం, పాత పెన్షన్ విధాన సాధన దిశగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నంబర్ 57 అమలుకోసం తలపెట్టిన పోరాటం న్యాయబద్ధమైనదని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మగౌరవ పోరాట బావుటా ఎగరేద్దాం

నెహ్రూనగర్: 1985లో కారంచేడు దళితులపై అగ్రకుల భూస్వాముల దమనకాండకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ ఫలితంగా దళిత ఆత్మగౌరవ పోరాట బావుటా దేశంలో సరికొత్త సామాజిక న్యాయశక్తిగా మారిందని, తద్వారా నూతన చట్టాలను సాధించి రాజ్యాంగ హక్కులు పొందగలిగామని భీమ్ సేన సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపు నీలాంబరం పేర్కొన్నారు. ఆ స్ఫూర్తితో దళిత, బహుజనులు ఆత్మగౌరవ పోరాట బావుటా ఎగరేయాలన్నారు. కారంచేడు దళిత అమరవీరుల 40వ సంస్మరణ దినోత్సవాన్ని లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత ఉద్యమాలు అంబేడ్కర్ భావజాల స్ఫూర్తితో రాజకీయ సాధికారతతో గ్రామ గ్రామాన కొనసాగించాలన్నారు. దళిత, బహుజన యువత విద్య ఉపాధి రంగాల్లో మహాత్మ జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ మార్గాలను అనుసరించి రాజకీయ చైతన్యం పొందాలని నీలాంబరం పిలుపునిచ్చారు. నేటికీ ఏదోక చోట దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయని, వీటన్నింటికి ఎదురొడ్డి పోరాడాలంటే దళితులంతా ఏకతాటిపై నిలబడి తమ హక్కుల సాధన కోసం నిలబడాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. దళిత సంఘాల నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, బండ్లమూడి స్టాలిన్, చిన్నం డేవిడ్ విలియమ్స్, బత్తుల అనిల్, కనకవల్లి వినయ్, దార్ల చిన్న, తిప్పాబత్తిన గోవింద్, రావినూతల కమలకుమారి, లక్ష్మీనారాయణ, శామ్యూల్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమావేశం

నెహ్రూనగర్: పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనలను తీసుకుని వాటి అమలుకు చర్యలు తీసుకుంటామని పశ్చిమ నియోజకవర్గం ఈఆర్ఓ, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని అదనపు కమిషనర్ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో 1200 మందికి మించిన ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అదే ప్రాంతంలో మరొక కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఆయా కేంద్రాల ఏర్పాటుపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు తీసుకున్నామని, వాటిని నిబంధనల మేరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల పేర్లు, చిరునామాలు మార్పులు ఉంటే వాటిని కూడా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఏఈఆర్ఓలు డి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, సూరజ్ కుమార్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ పద్మనాభరావు, రామకృష్ణ (బీజేపీ), సీహెచ్ వాసు (బీఎస్పీ), బి.సునీల్ కుమార్ (కాంగ్రెస్) టి.సేవా కుమార్ (ఆమ్ ఆద్మీ పార్టీ), సీహెచ్.రామ వెంకట త్రినాద్(జనసేన) పాల్గొన్నారు.

• వాన.. హైరానా..

గుంటూరు నగరంలో గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మూడు వంతెనల వద్ద మురుగు వరదలా పారింది. ఆ సమయంలో అటుగా వచ్చే విద్యార్థులు, పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



శివారులో దాహం కేకలు

- నగర శివారు కాలనీల్లో నీటి సరఫరా పునరుద్ధరించని అధికారులు
- తీవ్ర తాగునీటి ఇక్కట్లలో ప్రజలు



తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద ఫిల్టర్ అవుతున్న రా వాటర్



సమ్మె చేస్తున్న కార్మికుడి ఇంటి గోడకు నోటీసు అంటించిన ఇంజినీరింగ్ సిబ్బంది

నెహ్రూనగర్: ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో గుంటూరు నగరంలో తాగునీటి సరఫరాకు తీవ్ర ఇబ్బంది ఏర్పడిన సంగతి పాఠక విదితమే. సమ్మె చేస్తున్న సిబ్బంది స్థానంలో రోజు వారీ వేతనం కింద ప్రైవేట్ వ్యక్తులను పెట్టి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్‌లో ఫిల్టరేషన్, పంపింగ్ ప్రక్రియను పునరుద్ధరించారు. అయితే గత రెండు రోజులుగా పంపింగ్ ప్రక్రియ అరకొరగా సాగడంతో పైపులైన్లలో ఎయిర్ పట్టేసి గురువారం ఉదయం కూడా పంపింగ్ సక్రమంగా జరగలేదు.

శివారు కాలనీలకు అందని తాగునీరు

తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్, సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా నెహ్రూనగర్, ఎల్ఎల్ఆర్(నాజ్‌సెంటర్), హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం), స్తంభాలగరువు, ఏటీ అగ్రహారం, కోర్టు కాంపౌండ్, బీఆర్ స్టేడియం, ఎల్‌బీ నగర్, నల్లచెరువు, వసంతరాయపురం రిజర్వాయర్ల ద్వారా నగరంలోని 64 వాటర్ ట్యాంకులకు తాగునీరు సరఫరా అవుతుంది. ఒక్క రోజు సరఫరా ఆగిపోతే నగరంలోని శివారు కాలనీలపై తాగునీటి ప్రభావం రెండు రోజులు పడుతుంది. గురువారం ఉదయం కూడా శివారు ప్రాంతాలైన బాలాజీనగర్, ప్రగతినగర్, నేతాజీనగర్, మంగళదాస్‌నగర్, కేవీపీ కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీ, కార్మికుల కాలనీ, శ్రీనగర్, సంజీవయ్యనగర్‌కు తాగునీరు సరఫరా కాలేదు. గుంటూరు నగరానికి కృష్ణానది నుంచి 135 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే) సరఫరా అవుతుంది. బుధవారం రాత్రి నుంచి గురువారం రాత్రి వరకు నగరానికి 135 ఎంఎల్‌డీ నీటి సరఫరా జరిగిందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్క రోజు పంపింగ్ ఆగినా హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తాగునీరు సరఫరా ఇచ్చే ముందు బైపాస్ పెడతారు. మోటార్ల సాయంతో పైపుల్లో ఉన్న నీటిని లాగినప్పుడు ఎయిర్ పట్టేసినప్పుడు..ఈ ఎయిర్ గ్యాప్ ఫిల్ చేసేందుకు బైపాస్ పెడతారు. ఆ తరువాత హెడ్ వాల్వ్ ఓపెన్ చేస్తే ఆ ఒత్తిడికి నీరు సరఫరా పూర్తిస్థాయిలో జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తయి శివారు కాలనీలకు తాగునీరు అందడానికి సుమారు రెండు రోజులు దాకా పడుతుందని సమ్మె చేస్తున్న వర్కర్లు చెబుతున్నారు.

కార్మికుల ఇళ్ల గోడలకు నోటీసులు

తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్, ఉండవల్లిలో పనిచేస్తున్న 87 మంది కార్మికులకు విధులకు గైర్హజరవుతున్నారు. వీరికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు ఇంజినీరింగ్ అధికారులు ప్రయత్నం చేసినప్పటికీ కార్మికులు వాటిని తీసుకునేందుకు నిరాకరించడంతో ఇంజినీరింగ్ సిబ్బంది గురువారం ఉదయం కార్మికుల ఇళ్లకు వెళ్లి నోటీసులు అందజేశారు. విధుల్లో చేరాలని.. లేని పక్షంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో ఫార్మా ఇష్టులు!

- ఆసుపత్రిలో అదనంగా ఫార్మాసిస్టులు
- పోస్టులు లేకపోయినా మూడేళ్లుగా కొనసాగింపు
- అదనపు సిబ్బంది వేతనాలపై ఆరోపణలు



గుంటూరు మెడికల్: పరిపాలన అధికారుల తప్పిదాలతో ఉమ్మడి ఏపీలో పేదల పెద్ద ఆసుపత్రిగా పేరుగడించిన గుంటూరు జీజీహెచ్ పరువు రోడ్డున పడుతోంది. మూడేళ్లుగా జీజీహెచ్‌లో ముగ్గురు ఫార్మాసిస్టులు అదనంగా విధులు నిర్వహిస్తున్నారు. మంజూరు పోస్టులు లేకపోయినా అదనపు సిబ్బంది ఏవిధంగా పనిచేస్తున్నారో ఎవరికీ అర్థం కాని ప్రశ్నగా మారింది. ఆర్డీ కార్యాలయం అధికారులు ఫార్మాసిస్టుల వివరాలు కోరినప్పుడు జీజీహెచ్ అధికారులు ఖాళీలు లేవని లిఖితపూర్వకంగా ఇచ్చారు. మళ్లీ ఖాళీలు ఉన్నాయంటూ తాజాగా ఓ ఫార్మాసిస్టు జీజీహెచ్‌లో చేరేందుకు రావడంపై ఆస్పత్రి వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు తప్పిదాల మీద తప్పిదాలు చేస్తూ పరిపాలన తీరును నవ్వుకునేలా చేస్తున్నారు.

అ'ధనం'గా నియామకాలు

గుంటూరు జీజీహెచ్‌లో 2022లో కాంట్రాక్టు ఫార్మాసిస్టుల పోస్టుల నియామకానికి అనుమతి వచ్చింది. నాడు ఆసుపత్రికి మంజూరు చేసిన పోస్టులకంటే అదనంగా రిక్రూట్ చేసుకున్నారు. రెగ్యులర్ ఫార్మాసిస్టుల పోస్టులు ఖాళీగా ఉండటంతో వేతనం ఇబ్బంది లేకుండా రెగ్యులర్ ఉద్యోగుల వేతనాల ఖాతాల్లో నుంచి కాంట్రాక్టు ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ రెగ్యులర్ ఫార్మాసిస్టు, ఫారిన్ సర్వీసులో పనిచేసి పోస్టింగ్ కోసం గుంటూరు జీజీహెచ్‌లో ఖాళీలు ఉన్నాయని తెలుసుకుని దరఖాస్తు చేసుకున్నాడు. సదరు ఉద్యోగికి రెగ్యులర్ పోస్టు ఖాళీగా ఉన్నా.. లేవంటూ ఆసుపత్రి అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారు. ఆర్డీ కార్యాలయం అధికారులు దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో రెగ్యులర్ ఉద్యోగాల ఖాళీలు చూపించి ఫారిన్ సర్వీస్ నుంచి వచ్చిన ఫార్మాసిస్టును మే నెలలో జాయిన్ చేసుకున్నారు.

చర్యలు శూన్యం

గత నెలలో రెగ్యులర్ ఫార్మాసిస్టు జీజీహెచ్‌లో చేరేందుకు ఆర్డీ కార్యాలయం అధికారులను కలవడం ద్వారా వెలుగులోకి వచ్చిన అదనపు ఫార్మాసిస్టుల వ్యవహారంపై ఇప్పటివరకు ఎవరిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. గతంలో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగికి ఫార్మాసిస్టుల వివరాలు తప్పుగా అందజేశారంటూ మెమో ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అదనపు సిబ్బందిని ఏళ్ల తరబడి ఆసుపత్రిలో కొనసాగిస్తున్నా ప్రజా ధనాన్ని వృథా చేస్తున్నా నేటి వరకు ఎవరిపై ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో ఆసుపత్రి కార్యాలయ అధికారులకే తెలియాలి. పరిపాలన పరమైన అంశాల్లో ఆసుపత్రికి ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. ఆసుపత్రి, కళాశాల పరిపాలన అధికారులకు ఆసుపత్రి, గుంటూరు వైద్య కళాశాల పరిపాలనా విషయాలపై భాగస్వామ్యం కల్పించింది. దీంతో వైద్య కళాశాల అధికారులు, జీజీహెచ్ అధికారులు ఒకరిపై ఒకరు నెపాలు వేసుకుంటూ చేసిన తప్పును కప్పి పుచ్చుకుంటూ విలువైన ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణతో వెలుగులోకి...

గుంటూరు జీజీహెచ్‌లో ఫార్మాసిస్టుగా, ఫార్మాసిస్టుల సంఘం నాయకురాలుగా పనిచేస్తున్న ఎన్.రాధారాణి ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేశారు. మార్చి 1న గుంటూరు ఆర్డీ కార్యాలయం వారు జీజీహెచ్‌లో ఫార్మాసిస్టుల వివరాలు తెలియజేయాలని లిఖిత పూర్వకంగా ఆదేశాలు ఇవ్వగా, ఒక్క ఖాళీ కూడా లేదంటూ జీజీహెచ్ వర్గాలు మార్చి 4న లిఖిత పూర్వకంగా ఆర్డీ కార్యాలయానికి తెలియజేశారు. ఆసుపత్రిలో ఫార్మాసిస్టుల పోస్టులు రెగ్యులర్ 20, కాంట్రాక్టు 16 ఉన్నాయని, ఒక్క ఖాళీ కూడా లేదని లిఖిత పూర్వకంగా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. అయితే ఆర్డీ కార్యాలయానికి సమర్పించిన నివేదికకు ప్రస్తుతం జీజీహెచ్‌లో హాజరు పట్టీలో ఉన్న ఫార్మాసిస్టుల వివరాలకు వ్యత్యాసం కనిపిస్తుంది. ఆర్డీ కార్యాలయానికి సమర్పించిన జాబితాలో 36 పోస్టులు ఉన్నట్లు నివేదిక అందజేశారు. కానీ వేతనాలు 39 మందికి ఆసుపత్రి అధికారులు డ్రా చేస్తున్నారు. అదనంగా ఉన్న ముగ్గురు ఫార్మాసిస్టులకు ఎక్కడి నుంచి జీతాలు తీస్తున్నారో అంతుపట్టని దిగా మారింది. అనుమతి లేకుండా అదనపు సిబ్బందిని నియమించుకోవడమే కాకుండా వారిని ఏళ్ల తరబడి కొనసాగించడంపై తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైభవంగా శ్రీవారికి తిరుప్పావడ సేవ



శ్రీవారి తిరుప్పావడ సేవలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవాలయంలో బుధవారం శ్రీవారికి అత్యంత వైభవంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. వేదపండితులు మాధవస్వామి బృందం ఆధ్వర్యంలో స్వామి ఉత్సవమూర్తులకు విశేష అర్చనలు, అభిషేకాలు, అలంకరణ జరిగాయి. స్వామి దివ్య దృష్టి పడేలా మహా మండపంలో పెద్ది శ్రీనివాసరావు, శ్రీలత దంపతులు సమర్పించిన మేల్‌చాట్ వస్త్రంపై చిత్రాన్న రాశిలో జిలేబీ, వడ, అప్పాలు, లడ్డూలు, దోసెలను దీర్ఘ చతురస్రాకారంగా 18 అంగుళాల ఎత్తులో ఏర్పాటు చేశారు. అష్టదిక్కులు, ఆరాధనలు జరిపి వివిధ రకాల పూలమాలతో తిరుప్పావడపై అలంకరించారు. వేదపండితుల ఆధ్వర్యంలో నారాయణం ప్రసాదాచార్యులు వ్యాఖ్యానంతో శ్రీనివాస గద్యాన్ని శ్రవణానందంగా పఠించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, సభ్యులు, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు బొల్లేపల్లి సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

అర్జీలు ఎత్తుకెళ్లిన వ్యక్తిపై కేసు

పట్నంబజారు: తహసీల్దార్ కార్యాలయంలోకి అక్రమంగా చొరబడి, అక్కడ ఉన్న అర్జీలు తీసుకెళ్లి, ప్రజల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈస్ట్ సబ్ డివిజన్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో సంగడిగుంట ప్రాంతానికి చెందిన అంగిరేకుల గోపి అధికారులకు తెలియకుండా అర్జీలు తీసుకెళ్లి ప్రజల వద్ద అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. ఈక్రమంలో పలువురు స్థానికులు ఆర్ఐ కరిముల్లాకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ఐ లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, గోపిపై కేసు నమోదు చేశారు.

చిరస్మరణీయుడు సింగారవేలు శెట్టియార్

లక్ష్మీపురం: స్వాతంత్ర్యం రాకముందే మద్రాసులో మున్సిపల్ కార్మికుల సంఘం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కరించడం కోసం కృషి చేసిన సింగారవేలు శెట్టియార్ చిరస్మరణీయుడని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి అన్నారు. గుంటూరు కొత్తపేటలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం కోటి వీరాంజనేయులు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీనియర్ నాయకుడునూతలపాటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు రావుల అంజిబాబు మాట్లాడారు. అనంతరం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా, ఇంటి నుంచి స్టీల్ బాక్స్‌లు తెచ్చుకునే వారికి చికెన్, మటన్ స్టాల్స్‌లో కేజీకి రూ.10 తగ్గింపునకు ఆయా షాపుల యజమానులు ఒప్పుకున్నారని ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలోని హోటల్స్, చికెన్, మటన్ స్టాల్స్, కర్రీ పాయింట్స్ నిర్వాహకులతో ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వినియోగం నిషేధంపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఇన్‌ఛార్జ్ కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం వలన ప్రజారోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించేలా ప్రజలు చికెన్, మటన్ షాపులకు వెళ్లేవారు ఇంటి నుంచి స్టీల్ బాక్స్‌లు తెచ్చుకుంటే వారికి కిలోకి రూ.10 తగ్గించడానికి ఆయా స్టాల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమోదం తెలపడం అభినందనీయమన్నారు. చికెన్, మటన్ షాపుల దగ్గర ఈ మేరకు బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్, సీఎంఓహెచ్(ఇన్‌చార్జి) టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ(ఇన్‌చార్జి) సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర సమస్యలపై ఆందోళన వద్దు

అవగాహన సంస్థ ఆరోగ్య సభలో ఆప్తమాలజిస్ట్ డాక్టర్ టి.పావని



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: కేటరాక్ట్‌గా పిలవబడే కంటి శుక్లం అనేది వయస్సుతో పాటు వచ్చేదని, దాని గురించి ఎటువంటి భయం అక్కరలేదని, దృష్టి అస్పష్టంగా ఉంటే కేటరాక్ట్‌గా భావించి సర్జరీ చేయించుకోవాలని అప్తమాలజిస్ట్ డాక్టర్ టి.పావని అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభలో ఆమె మాట్లాడారు. పెద్ద వయస్సు వారికి కంటి సమస్యలు, వ్యాధులు సహజంగానే వస్తుంటాయన్నారు. గతంలో శుక్లం ఆపరేషన్‌కి పది, పదిహేను రోజులు ముందు, తరువాత చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు రెండు గంటల్లో హాస్పటల్‌కి వచ్చి ఆపరేషన్ చేయించుకుని ఇంటికి వెళ్ళవచ్చన్నారు. డాక్టర్ పావనిని అవగాహన సంస్థ సభ్యులు సత్కరించారు. ఈ సభలో యోగా గురువు అచ్యుత ఇందు శేఖర్, ఇంజనీర్ ఎన్.సదాశివం, సంస్థ సభ్యులు ఫణీంద్ర, సత్యన్నారాయణలు పాల్గొని ప్రసంగించారు.

చిరస్మరణీయ నటి బి.సరోజాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: జగదేకనటి, అభినయ సరస్వతి బి.సరోజాదేవి మూడు దశాబ్దాల పాటు తెలుగు, కన్నడ, తమిళ భాషలలో నటించి చిత్ర సీమ పై చెరగని ముద్ర వేశారని రచయిత్రి కవి పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో బి.సరోజాదేవి చిత్రపటానికి మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు, సంస్థ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బహు భాషా నటిగా రెండు దశాబ్దాలు ఏడాదికి ఆరేడు సినిమాల్లో నటించిన బి.సరోజా దేవి ఏ భాషలో నటించిన హుందాగా నడుచుకుని ఆయా పాత్రలకు న్యాయం చేశారన్నారు. గాయకులు, రంగస్థల నటుటు పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ తెలుగులో అగ్రగణ్య నటుల్లో బి.సరోజాదేవి ఒకరిగా పేరుపొందారన్నారు.

రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో 'సీతారామయ్య' విద్యార్థి సత్తా



సాత్విక్‌ను అభినందిస్తున్న మల్లిఖార్జునరావు, విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి అబాకస్ పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల రెండో తరగతి విద్యార్థి కోడెబోయిన సాత్విక్ మెరిట్ అవార్డు సాధించినట్లు పాఠశాల కమిటీ అధ్యక్షుడు దేవినేని మల్లిఖార్జునరావు, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గురువారం లక్ష్మీపురంలోని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థి సాత్విక్‌ను వారు అభినందించారు. ఇటీవల యూసీమస్ ఆధ్వర్యంలో జరిగిన అబాకస్‌లో తమ విద్యార్థి సత్తా చాటడం అభినందనీయమన్నారు. అబాకస్ నేర్చుకోవడం వలన గణితం సులువుగా చేయగలిగే సామర్థ్యం పెంపొందుతుందని, విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడంతో పాటు ఏకాగ్రత పెంచడంలో అబాకస్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, ప్రైమరీ కో-ఆర్డినేటర్ దిల్ జహాన్, ప్రీ-ప్రైమరీ కో-ఆర్డినేటర్ టి.శ్రీదేవి, ఇన్‌చార్జ్ కె.హరిప్రియ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మాంటిస్సోరి విద్యార్థుల సత్తా



విద్యార్థులతో కేవీ సెబాస్టియన్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌లో మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో సెబాస్టియన్ మాట్లాడుతూ ట్రయాథ్లాన్ అండర్-14 కేటగిరీలో విజేతగా నిలిచిన 9వ తరగతి విద్యార్థి ఎం.నిఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అదేవిధంగా అండర్-16 కేటగిరీ 600 మీటర్ల పరుగులో 9వ తరగతి విద్యార్థులు పి.చరణ్, జె.జస్వంత్ ద్వితీయ స్థానంలో నిలవగా, లాంగ్ జంప్‌లో పి.గోవర్ధన్ తృతీయ స్థానాన్ని పొందారని తెలిపారు. క్రీడలు విద్యార్థుల జీవితంలో అంతర్భాగంగా ఉంటే శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసానికి బాటలు వేస్తాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి, ఐకమత్యం, పోరాటపటిమ అనే గొప్ప గుణాలను అందిస్తాయన్నారు.

సామాజిక మాధ్యమాలపై పట్టు అవసరం



మాట్లాడుతున్న డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా

గుంటూరు ఎడ్యుకేషన్: డిగ్రీ స్థాయిలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై అవగాహన, పట్టు సాధించటం ద్వారా కళాశాల స్థాయిలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలను బాహ్య ప్రపంచానికి తెలియచేసే అవకాశాలు పుష్కలంగా ఉంటాయని, తద్వారా కళాశాలతోపాటు విద్యార్థుల ప్రగతికి మేలు కలుగుతుందని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఫిజికల్ సైన్స్ విభాగం, స్టూడెంట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో 'కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ ఆన్ సోషల్ మీడియా టు ఎన్‌హాన్స్ పబ్లిక్ పర్సెప్షన్ ఆఫ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజెస్' అనే అంశంపై జోన్-3 పరిధిలోని 26 డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి అధ్యక్షత వహించారు. అనంతపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు సోషల్ మీడియా పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్ నిర్వహించారు. బ్లాక్ బక్స్ టీం ఐదు సెషన్స్ ద్వారా సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఆర్జేడీ డాక్టర్ పి.కళావతి, కళాశాల విద్య అకడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ తులసి మస్తానమ్మ, ఓఎస్డీ డాక్టర్ ఏపీ కవిత తదితరులు పాల్గొన్నారు.